

# [illegible]

రంగయ్య బడిలో పని మానుకోడు.

"చెయ్యో, కాలో విరగాలి; లేదా చావైనా రావాలి. అంతవరకు నే నిలా ఉండాల్సిందే" అంటాడు.

అసలు పని మానుకుంటే వేరే జరుగుబాటు లేదని కాదు; అతని పెళ్ళాం మంగమ్మ చేతి ఇడ్లీలకు, వడలకు మంచి గిరాకీ ఉంది. పెద్ద కొడుకు దేవరాజు ఈ మధ్యనే ఇంటి ముందర టీ కొట్టు పెట్టాడు. చిత్తూరునుంచి, వేలూరు నుంచీ తెచ్చే అయిదారు గెలల అరటి పళ్ళూ నాలుగైదు రోజుల్లోనే ఖాళీ అయిపోతున్నాయి. ఇక చిన్న కొడుకు బాలరాజు స్కూల్ ఫైనల్ తప్పి, ఉద్యోగం కోసం ప్రాకులాడుతున్నాడు. నిదానం మీదట వాడికీ ఉద్యోగం దొరకవచ్చు. అంతవరకూ సిగ్గును ఒక పక్కకు పెట్టి వాడూ చేయి కలిపితే ఇంటి ముంగిట్లోనే ఏ చిన్న మిలిటరీ హోటలు లాంటిదో వెలగబెట్టవచ్చు. వ్యాపార దృష్టి ఉన్న వాడికి రంగయ్య ఇల్లు బహు చక్కని చోటు. సినిమాకు వెళ్ళే వాళ్ళందరూ ఆ రోడ్డు మీదుగానే వెళ్ళాలి. పక్క పల్లెల్లోని జనమంతా ఆ రోడ్డు వెంబడే ఊళ్ళోకి రావాలి. పట్న నడి ఎడారిలో చలివందిరి లాగా వాళ్ళ కది ఉపయోగ పడవచ్చు. ఒకవేళ పెద్ద లాభమేమీ లేకపోయినా, కూటికిమాత్రం లోటు రాదు.

కాని, రంగయ్యకు ఇవేమీ పద్దు.

అతను పాతకాలపు మనిషైనా, పట్టు దల కలవాడు.

ఆ ముసలివాడి కున్న ఆత్మస్థైర్యం మరొకరిలో ఉండదు.

"కూలో నాలో చేసి వీళ్ళనిద్దర్నీ పెంచాము. ఇప్పుడు వాళ్ళకూ రెక్కలొచ్చేశాయి. ఇంకా ఎందుకు ఆ చాకిరీ?" అంటుంది పెళ్ళాం.

"నాకు ఎవరూ పెట్ట నక్కర్లేదు. వాళ్ళ బతుకులు వాళ్ళు బతికితే చాలు. ఒంట్లో సత్తువ ఉన్నంతవరకు నాకేం భయం లేదు. నేను మూలపడితే తరవాత ఎట్లన్నా కానీ!" అంటాడు రంగయ్య.

కొడుకులు కూడా చెప్పి చూశారు. తాము పట్టిన కుందేటికి మూడంటే మూడే కాళ్ళు అన్నాడు రంగయ్య. వాగి వాగి ఊరుకున్న లౌడ్‌స్పీకర్లలాగా నోరు నొక్కుకునేశారు కొడుకులు.

ఆ హైస్కూల్లో ఎందరో హెడ్మాష్టర్లు మారారు. మరెందరో పంతుళ్ళు మారారు, మారుతూనే ఉన్నారు. నలుగు రైదుగురు బంట్రోతులు కూడా మారారు. కానీ, రంగయ్య మారలేదు! ఆ విద్యా భవనానికి చిరకాల మిత్రుడు ఎవరూ అంటే, ఒక్క రంగయ్యే! రోజూ ఇరవైనాలుగు గంటల్లో ముప్పాతిక వంతైనా ఆ మైత్రి కొనసాగుతూనే ఉంటుంది.

ఆ బడిలో స్వీపరు ఎవరూ అంటే రంగయ్యే!

ఆ బడిలో తోటమాలి ఎవరూ అంటే రంగయ్యే!

ఆ బడికి వాచ్‌మన్ ఎవరూ అంటే కూడా రంగయ్యే!

ఉదయం లేస్తూనే గదులన్నీ ఊడిచి శుభ్రం చేస్తాడు. సాయంకాలం మొక్కలన్నిటికీ నీళ్ళు తోడి పోస్తాడు. రాత్రిళ్ళు స్కూల్లోనే పడుకుంటాడు.

అప్పుడప్పుడూ అతనికి ప్రాణాంతకమైన సమయాలు కొన్ని తారసిల్లుతూ ఉంటాయి. వార్షికోత్సవాల్లో, ఎగ్జిబిషన్ సమయాల్లో, మీటింగులూ, నాటకాలూ మొదలైనటువంటి సందర్భాలలో బెంచీలూ, కుర్చీలూ మోయలేక అతని నడుము విరిగిపోతుంటుంది.

ఇంత కష్టపడితే అతనికి వచ్చే జీతం అతి స్వల్పం. కానీ, ఆ కష్టార్జితాన్ని అతను సంతోషంతో, భక్తితో కళ్ళకద్దుకుంటాడు. తృప్తిగా [illegible] బొడ్లో దోపుకుంటాడు. ఆ స్వల్ప వేతనంతోనే తాను ఇన్నేళ్ళు బ్రతికాడు. దానితోనే సంసార నౌకను ఒడిదుడుకులతో నెట్టుకుంటూ వచ్చాడు. ఎలాగో తంటాలుపడి చిన్న కొడుకును చదివించాడు. తనకోసం కాదు, వాడికోసమే! పెద్దకొడుకు మొరటువాడు. లోకం పోకడ బాగా తెలిసినవాడు. నడుము వంగి కష్టించగలడు. బ్రతుకు భయం వాడికి ఉండదు. కానీ, చిన్నవాడా సుకుమారుడు! కండలున్న మనిషయినా, వాడి గుండె ఆడదాని గుండె. చిన్నతనంలో ఎవరైనా 'ఉస్కో' మంటేనే బావురుమని ఏడ్చేసేవాడు. అందుకే వాడిని చదివించాడు. ఉద్యోగం సంపాదించుకుని మర్యాదగా వాడి బ్రతుకు వాడు బ్రతుకుతాడని ఆశించాడు రంగయ్య. కానీ, వాడు పరీక్ష తప్పాడు. స్కూల్ ఫైనల్లో గిరికీ కొట్టాడు. మళ్ళీ అక్టోబరుకు కట్టాడు. దాని దాని రాజుగారి గుర్రం గాడిదైంది! మరి తక్కువ మార్కులతో ఫెయిలయ్యాడు. అంతే. తరవాత ఆ ప్రయత్నం ఆగిపోయింది. ఉద్యోగంకోసం ప్రాకులాడాడు బాలరాజు. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫీసులో పేరు రిజిస్టరు చేయించుకున్నాడు. ఎక్కడెక్కడికో దరఖాస్తులు పంపుకొన్నాడు. ఉద్యోగం రాలేదు—

ఓ రోజు -- "ఒరేయ్, తమ్ముడూ! మిలటరీ హోటలు పెడదామురా!" అన్నాడు దేవరాజు.

"అలాగే పెట్టు!" అన్నాడు బాలరాజు.

"నీకు అక్కర లేదా? లేకపోతే ఎట్లాగిలా?" అన్నాడు దేవరాజు.

"అమ్మో ... నా తెల్లగుడ్డలు మాసిపోవయ్యో!" అన్నాడు బాలరాజు.

తెల్లగుడ్డలు మాసిపోవడమేకాదు-స్నోలూ, పౌడర్లూ ఉపయోగించుకోవటానికి వీలుండదు. నలుగురు మిత్రులతో కలిసి తిరగటానికి ఎంతకన్నా వీలుండదు. అందుకే వాడికి ఉద్యోగం కావాలి. వాడికి ఉద్యోగం దొరకనంతకాలమూ రంగయ్య తన ఉద్యోగం మానుకోడు.

అసలు ఎప్పటికీ మానుకోడేమో?

అతనికి కొడుకులమీద నమ్మకం లేదేమో?

## కలువకొలను సదానంద

అందుకే అంటూ ఉంటాడు పెళ్ళాంతో— "అన్నా దమ్ములు బిడ్డలు గానీ, గడ్డాలొచ్చాక ఒడ్డవాళ్ళా? ఎప్పటికయినా వాళ్ళ దారి వాళ్ళదే! ఏదో ఉద్ధరిస్తారు అని మనం భ్రమపడాల్సిందే గానీ, చివరికి లాభం లేదు చేతికి చిప్పే! ఎవరికి ఎవరవుతారు ఈ కాలంలో? తండ్రికి కొడుకు కాడు, అన్నకు తమ్ముడు కాడు. ఏదో ఋణం ఉన్నాం. తీరిపోయింది. ఇక వాళ్ళ దారి వాళ్ళు చూసుకుంటే చాలు. మన కేమీ పెట్టాల్సిన పని లేదు. స్కూల్లో దివాణం వంటి నౌకరీ ఉన్నంత వరకూ మన కేమీ భయం లేదు."

కొడుకులకు కోపం వస్తుంది. రోషంలో, పట్టుదలలో తండ్రికన్నా రెండాకులు ఎక్కువే మేశారు వాళ్ళు. "ముసిలోడా! ఎంత సేపూ మమ్మల్ని ఎత్తిపొడవకపోతే నీకు గడవదా? ఊరికే మా పాపం పోసుకుంటావు. అసలు నిన్నెవరు చావమన్నారు స్కూల్లో? 'నౌకరి మానేయి, హాయిగా ఇంట్లోనే పడి ఉండు' అని మొత్తుకున్నా ఎక్కడ వింటావు? ఏమైనా నువ్వే ముసలాడికి ఇంత బిగువు ఉండకూడదు" అంటూ చిర్రుబుర్రులాడేవారు.

తండ్రిని ఇంట్లో కూర్చోబెట్టుకుని, నలుగురిచేతా 'పిల్లలు మొగలాయీలు' అనిపించుకోవాలన్న పంతం వాళ్ళకూ ఉంది.

కానీ, రంగయ్య అతీతుడు.

"హె పిల్లదా, దాసరయ్యా! గుడ్డి పచ్చి పిల్లను వెక్కిరించిందట!-వారు నిర్వాకం చేసి కాలిపోయింది" అంటూ వ్యంగ్యాస్త్రాలు విసురుతాడు.

• • •

ఓ ఆదివారం రోజున అతనికి సుస్తీగా ఉంటే ఆ రాత్రి ఏమీ తినకుండానే పడుకునేందుకు స్కూలుకు బయలుదేరాడు. తాను స్కూలుకు వాచ్‌మన్ అయె మరి!

లోపలికి వెళ్ళి గేటు తలుపులు తాళం వేసుకున్నాడు. కాంపౌండు యార్డులో లైటు వెలుగుతూంది. ప్రతి రాత్రి తెల్లవారేదాకా వెలుగుతుంటుంది అది. 'పాపం! నువ్వు నిద్రపో, రంగయ్యా! నే మున్నానులే! ఒక కంట కనిపెడుతుంటాను' అన్నట్లు వెలుగుతూంది దీపం.

ఒంట్లో నీరసంగా ఉంది రంగయ్యకు. పడుకుంటేనే గానీ తట్టుకోలేడు.

ఆఫీసు గది పక్క గదిలోకి వెళ్ళాడు. రోజూ అక్కడే పడుకుంటాడు, బెంచీల మధ్యగా. గదిలో పురికొస్సు క్రింది దూలాలు అతని చింకిచాపకూ, పాత దిండుకూ విశ్రాంతి స్థలం.

బెంచీమీది కెక్కి, వాటిని లాక్కుని క్రింద పరుచుకుని పడుకున్నాడు. అతని పెంపుడు కుక్క గేటు సందులోంచి దూరి, లోపలికి వచ్చేసి అతని కాళ్ళ దగ్గర ముడుచుకు పడుకుంది.

రంగయ్య అంటే దానికి ఎంతో విశ్వాసం. ఏడేండ్లుగా అతని అండలోనే ఉంటోంది. ఈ ఏడేండ్లలో ఎన్నో పిల్లల్ని కన్నది. కానీ, ఒక్క పిల్లా కూడా లేదిప్పుడు. ఎవరెవరో ఎత్తుకెళ్ళి పెంచుకున్నారు. మరికొన్ని బాగా తిరిగి మరిగి వీధి కుక్కల్లో కలిసిపోయాయి. కానీ, ఈ కుక్క ఎక్కడికీ పోలేదు. రంగయ్య ఇల్లే దానికి ఆశ్రయం. రంగయ్య అనుచర్యయే దాని లక్ష్యం. యజమాని మీద దాని కున్న విశ్వాసం అటువంటిది. అందు చేతనే అది ఎక్కడికీ పోలేదు. ఎక్కడికీ పోదు. ఎప్పుడూ రంగయ్య కాళ్ళ దగ్గరే చుట్టి ఊరుకుంటుంది.

రంగయ్య దాన్ని ప్రేమగా ఒడిలోకి తీసుకున్నాడు.

రంగయ్యకు ఆప్తమైనవి రెండే.

తాను 'సేవిస్తున్న స్కూలు; తనను 'సేవిస్తున్న కుక్క!'

తన కాళ్ళ దగ్గరే కుక్కకు నిద్ర; స్కూలు ఆవరణలోనే తనకు నిద్ర.

కుక్క తనని విడువదు; తాను స్కూలును విడిచి ఉండలేడు.

అందుకే అతనికి ఇక్కడ హాయిగా నిద్ర పడుతుంది.



తన స్వంత ఇంట్లో కూడా ఉండదు అంత హాయి!

క్రింద గచ్చు లేచిపోయిన నేల, చుట్టూ ఇరుకుగా మెట్లు, నేలమీద పేరుకొన్న దుమ్మూ ధూళీ, విశాలంగా ఉన్న పెరడూ, విశృంఖలంగా ఉన్న పురాతన భవనం, కాంపౌండు యార్డులో దయ్యాల్లా పెరిగి ఉన్న చెట్లు, తరగతి గదులకు అవతలి వైపున వట్టి బీడులు, భయంకరమైన ఏకాంతం ...ఇవేమీ అతనికి పట్టింపులోనివి కావు.

మరునాడు బద్ధకంగా నిద్దుర లేస్తూనే ఠక్కున తెల్లవారిపోయి ఉంది. పొద్దు బారెడు దాకా పైకెక్కి పోయి ఉంది. రంగయ్య గుండె గుభిల్లు మంది. ఇంత ఆలస్యంగా లేస్తే పది అయ్యే లోపున తాను ఏం పనులు చేసేటట్టు?

మెట్ల కింద ఒదిగి కూర్చుని అతని వేపే దీక్షగా చూస్తూన్న కుక్క, అతను లేవగానే తోక ఆడిస్తూ ఒళ్ళు జాడించుకుంది.

రంగయ్య గబగబ చాప చుట్టగా చుట్టి, దాన్ని దూలాల మీద ఉంచడానికి మెట్లమీది కెక్కాడు. చాపను దూలాల మీదికి జరుపుతూ ఉన్నాడు.

శరీరం బలహీనంగా ఉంది. నిన్నటి నుంచీ నిస్త్రాణగా ఉంది. గత రాత్రి భోజనం కూడా చేయలేదు. బద్ధకంగా ఉంది. కళ్ళు గిర్రున తిరిగాయి. తల దిమ్మెక్కి పోయింది. చూపు ఆనలేదు. తాను ఎక్కడెక్కడో ఎగిరిపోతున్నట్లు ఉంది. క్షణాలు యుగాలై పోతున్నట్లున్నాయి. ప్రపంచం గిరగిరా తిరిగిపోతున్న ట్లనిపించింది.

రంగయ్యకు ఏమీ తెలియలేదు. దీర్ఘకాలం గడిచిపోయినట్లు తోచింది. తను మరో జన్మ ఎత్తినట్లనిపించింది. తా నెక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు? ఏమీ తెలియడం లేదు.

కొన్ని క్షణాల తరవాత రంగయ్యకు బుద్ధి స్థిరత్వం ఏర్పడింది. చూపు సరిగ్గా ఆనింది. ఆశ్చర్యం వేసింది! తాను మెట్ల సందుల్లో పడిపోయి ఉన్నాడు! ఎలా పడిపోయాడు? ఏమో? ఎలా పడ్డాడు? మెల్ల మెల్లగా జ్ఞాపకం వస్తోంది. తను చాప చుట్టాడు. మెట్లపైకెక్కాడు. అంతే! కళ్ళు గిర్రున తిరిగాయి. కిందికి విరుచుకు పడిపోయాడు.

పైకి లేవబోయాడు. ఒళ్ళంతా నొప్పులు. కదిలేప్పటికి లేదు. అవయవా లన్నీ కత్తితో నరికినట్లు జివ్వుమంటున్నాయి.

రంగయ్య లేచి నిలబడి దభేలున పడిపోయాడు.

"అయ్యయ్యో! కాలు విరిగిపోయింది!" అంటూ మూలిగాడు.

కుయ్యి కుయ్యి మంటూ అతని చుట్టూ తిరిగింది కుక్క. గేటు దగ్గరికి పరుగెత్తింది. మళ్ళీ అతని దగ్గరికి పరుగెత్తు కొచ్చింది.

రంగయ్య చిన్నగా డేకుతూ, డేకుతూ గేటు దగ్గరికి వచ్చాడు. గేటు తాళం తీసి బయట పడ్డాడు. కుక్క 'కుయ్యో' మని అరిచింది. పిల్ల గజాల దూరంలో ఉన్న తన గుడిసెను చూసేసరికి రంగయ్యకు ఏడుపు ముంచు కొచ్చింది. దేవరాజు టీ కలుపుతూ కనిపించాడు.

"ఒరే, నాయనా, దేవరాజా! కాలు విరిగిపోయిందిరా! రండిరా! అయ్యయ్యో! కాలు విరిగిపోయిందిరా, నాయనా!" అంటూ వలవలా ఏడ్చేశాడు. అక్కడి నుండి పరుగెత్తు కొచ్చాడు దేవరాజు. రంగయ్యను రెండు చేతులతో భుజం మీది కెత్తుకొని ఇంటి లోపలికి తీసుకు వెళ్ళాడు.

డాక్టరు దగ్గరి కెళ్ళి అయిదు రూపాయలు దక్షిణ చెల్లించుకొని డాక్టరు సర్టిఫికేటు పట్టుకొచ్చాడు దేవరాజు.

"ఇక లీ వెందుకూ? శాశ్వతంగా లీవు తీసుకో!" అన్నా వినేవాడు కాడు రంగయ్య. అది తెలుసు కొడుకులకు. ఇక ముసలివాడి కాలు బాగుపడదు అని వాళ్ళ ఆంచనా. అందుచేత ఊరికే లీవు వ్రాసుకుంటే మాత్రం ఏం పోయిందిలే అనుకున్నారు.

"రెండు నెలలు రాయనా?" అన్నాడు బాలరాజు.

"రెండు నెలలే? !" అన్నాడు రంగయ్య— 'రెండు యుగాలే!' అన్నట్లు.

"రెండు నెలలు రాసుకోకపోతే ఎల్లా మరి? ఒళ్ళు నయం కావద్దా?" అంటూ ఒప్పించారు కొడుకులు.

కారణం వివరిస్తూ సెలవు దరఖాస్తు వ్రాసి రంగయ్య చేత బొటన వేలి గుర్తు వేయించి, డాక్టరు సర్టిఫికేటు జోడించి హెడ్మాస్టరుకు ఇచ్చి వచ్చాడు బాలరాజు.

> **పెళ్ళి**
>
> పెళ్ళిచేసుకోవద్దు. కావాలంటే ప్రేమించు. ప్రేమించేముందు, ప్రేమార్థులగల వ్యక్తిని ఎన్నిక చేసు కోవడం అవసరం.
>
> —చెకో

ఒక్క అరగంట సేపూ పెద్ద ఆర్భాటం చేశాడు రంగయ్య.

"కిరాతకులారా! నా కాలు విరగ్గొట్టే శారా! మీ పాపం మండిపోనూ! నా కాలు విరగ్గొట్టేశారు! ముసలితనంలో నా కేం గతి తెచ్చి పెట్టార్రా. దుష్ట కొడకల్లారా!"

పిచ్చి పిచ్చి వాగుడు ఎక్కువగా ముదిమితోనే మైత్రి నలుపుతూ ఉంటుంది కాబోలు!

కానీ, అతని కాలు విరగలేదని తేలింది. అయితే, బాగానే బెణికింది. శరీరంలో అక్కడక్కడా లోదెబ్బలు తగిలాయి. అయినాకూడా రంగయ్య కదలలేక పోయాడు.

ఇక స్కూల్లో పని చేయలేడు రంగయ్య. స్కూలు గోడల దగ్గరికైనా వెడలిపోలేడు.

"హెడ్మాస్టరుని లీ వడిగితే ఇస్తాడ్రా?" అన్నాడు కొడుకుతో.

"ఎందు కివ్వడూ?" అన్నాడు బాలరాజు.

ఎవడో నాటు వైద్యుడు కోడిగుడ్డు పట్టు వేసి వెళ్ళాడు.

ఆ రోజంతా ఒకటే ముఖారి రాగాన్ని ఆలాపించాడు రంగయ్య.

"నా గతి ఇంకేముందిరా, దేవుడా! ముక్కలు విరగ్గొట్టి మూల కూర్చో పెట్టేశావే! ఇంక మీదట నా కింత కూడెవరు పెడతారు? నా కింత మన్ను ఎవరు వేస్తారు?" అంటూ వాపోయాడు.

"ఇదిగో! నువ్వూరుకుంటావా, ఊరుకోవా?" అంటూ గద్దించారు కొడుకులు.

ఆ రాత్రి నిద్రపట్టలేదు రంగయ్యకు. కాస్సేపయినా ఊరుకోడు. ఏదో గొణుగుతాడు. నిమిష నిమిషానికీ విసుక్కుంటాడు.

"చీకటి గుయ్యారంలా ఉంది ఈ కొంప! కొంపనా, కొంపకు బట్టిన పీడనా? థూ! థూ!" అంటాడు.

"అబ్బబ్బా! నరికి పారేయండ్రా ఈ దోమల్ని! ఈ దోమలుంటే ఇక నిద్దర బట్టినట్లే!" అంటాడు. నిజానికి ఇక్కడి కన్నా స్కూల్లోనే ఎక్కువ దోమలున్నాయి. అక్కడి దోమల కాట్లకు బాగా అలవాటు పడిన రంగయ్యకు ఈ దోమల కాట్లు ఆనందదాయకంగా లేవు కాబోలు!

అతని కాళ్ళ దగ్గరే పడుకుంది కుక్క. దాన్ని మునుగు లోపలగా రొమ్ముల దగ్గరికి తీసుకున్నాడు. "అమ్మా! చూడమ్మా! నా కాలు విరిగిపోయింది. నేను చచ్చిపోతానే, తల్లీ! తరవాత ఎక్కడికి పోతావు? నా మీద నీ కెంత పాశమే, పిచ్చిదానా! దా! బాగా పడుకో! నిద్దరపో!" అంటూ ఏడుస్తూ వీపు నిమిరాడు.

"ఏమమ్మా? నిద్దర పట్టలేదూ? స్కూల్లో ఆయితే బాగా నిద్ర పోయే దానివి! అవును! ఇక్కడ ఏమీ బాగా లేదు. చూడు! ఒకటే దోమలు! చీకటి కొంప!" అన్నాడు మళ్ళీ.

కుక్క అన్నీ మౌనంగా వింటూ పడుకొంది.

* * *

రెండు వారాల్లో అటూ ఇటూ చిన్నగా తిరగసాగాడు రంగయ్య. ఏమీ పాలు పోవడంలేదతనికి. పొద్దు గడవడం కష్టంగా ఉంది. చేయడానికి పని లేదు కదా మరి?

రోజూ పొద్దుటి వాలుగయిదు పోల్లయినా గేటు దగ్గరికి వెళ్ళి స్కూలు లోపలికి తొంగి చూసి వస్తాడు. కొత్త నౌకరు కంటబడినప్పుడల్లా అతని చేతులు చిమచిమలాడేవి.

నెల తిరక్కుండానే రంగయ్యకు కాలు బాగై పోయింది.

ఈ నెల రోజుల్లో అదృష్టం పండి బాలరాజుకు రైల్వే నుండి అపాయింట్ మెంట్ ఆర్డరు చేతికి వచ్చింది. అదే ఊళ్ళో కాల్ బాయ్‌గా పొద్దు వేళా రాత్రి, వారం, పది రోజులుగా పనికి వెళ్ళి వస్తున్నాడు.

ఒకనాటి ఉదయం రంగయ్య గొణు క్కుంటున్నాడు. "నన్ను ఎట్లాగూ కాకుండా చేశారు. నా నౌకరీ ఊడగొట్టా లనే ఇదంతా! రెండు నెలలు లీవు రాసు కోవటం దండగై పోయింది. నా తెలివి నేమనాలి? ఒక్క నెల రాసుకుని ఉండ కూడదూ?"

డ్యూటీకి వెళ్ళడానికి గబగబ బట్టలు తొడుక్కుంటున్న బాలరాజు అన్నాడు: "అయ్యా! ఒక నెలా లేదూ, రెండు నెలలూ లేదు! నువ్వు వచ్చేంత వరకూ నీ కింక లీవే! రామా, కృష్ణా అనుకుంటూ నీ మంచం మీద నువ్వు పడి ఉండు!"

పిల్లవాడికి వచ్చినట్లు వచ్చేసింది రంగయ్యకు ఏడుపు.

అతని వ్యవహారం ఇంట్లో వాళ్ళకు ఏమాత్రం నచ్చలేదు.

"ఛీ! ఛీ! ఏం మనుషులో వీడు! వయస్సు పైబడుతున్నా పెద్ద తరహా అన్నది లేదు. ఎంత చెప్పినా బూడిదలో పన్నీరే! కుక్కను తెచ్చి సింహాసనం మీద పెడితే, దిబ్బల దగ్గరికి పోకుండా ఉంటుందా? కాటికి కాళ్ళు చాపుకున్న ముసలాడికి ఈ సాధింపులూ, బెదిరింపులూ ఎందుకో?" అన్నాడు దేవరాజు.

రంగయ్య దండతాడిత భుజంగంలా ఒక్కసారి పైకి లేచాడు. "నోరు ముయ్యరా, పోరంబోకా! ఎక్కడ— మీ జీతావాయన దొరతనం చేసింది? తాతకు దగ్గులు నేర్పిస్తారు ఎదవలు! మహా పెద్ద ప్రయోజకులైనట్లు వక్కాణిస్తారు. నేను నౌకరి చేసుకుంటే ఎంత అవమానంరా పాపం, మీకు? ఏదీ ఆ రోజున చెప్పవాడా ఆ మాట 'ఏదో పుట్టి పోయాం, మా రెండుకు కష్టపడతారు లెండి, పాపం. ఏ దిబ్బలోనైనా పారేయండి, బతికి పోతాం' అని? ఈ రోజు చూస్తారు. ...టికి వచ్చినట్లు చూస్తారు. ఎంత బడాయి! నాకు నౌకరీ లేకుండా ఉంటే ఇంకా భూమ్మీద ఉండే వాళ్ళేనా మీరు? వీధిన పడి ఉండేవాళ్ళు గదరా! హ్హ...యి! నాకు పాఠం చెబుతారు పిల్ల పింకల్లారా!"

దేవరాజు నోరు నొక్కుకున్నాడు.

బాలరాజు డ్యూటీకి వెళ్ళిపోయాడు.

శివు ముగిసేంతవరకూ ఇంట్లో రంగయ్య నౌకరిని గురించి కాగిన పెనం మీద నీటితుంపరలు పడుతూనే ఉన్నాయి. తండ్రిని నౌకరికి పోవద్దని చిలక్కి చెప్పినట్లు చెబుతున్నారు కొడుకులు. "చిలక్కి చెప్పినట్లు చెబుతూనే ఉన్నాం" అంటున్నారు ఇరుగు పొరుగు వాళ్ళతో.

"అయ్యా! కండ కరిగించి స్కూలుకు ధారపోయడమే కానీ, నువ్వు బావుకుంటున్నది ఏమీ లేదు. ముందెప్పుడో బానిసలు ఉండేవాళ్ళట! ఇప్పుడు నీకు ఆ బానిస అన్న పట్టం ఒకటి మాత్రం లేదు. బానిసకన్నా హీనంగా ఉపయోగించుకుంటున్నారు. గాడిద చాకిరీ చేసేది చాలక, హెడ్మాస్టరు చేత ప్రతి రోజూ చీవాట్లు, ఈసడింపులూ తప్పడం లేదు. ఇన్నాళ్ళూ వేరే విధి లేకుండా చేశావు. మేమూ ఈ నాడు సంపాదించగలిగిన వాళ్ళమైనాము. తండ్రి ఋణాన్ని మరిచి పోగల కృతఘ్నులమూ కాము. ఇంకా ఎందుకీ బండ చాకిరీ చెప్పు? మేమున్నాం కదా— ముసలితనంలోకూడా ఈ అవస్థ ఎందుకు చెప్పు!" ఇవీ చిలక్కి చెప్పినట్లు చెప్పే మాటలు.

చిలక అవకాశం పలికింది.

"అది కాదురా. నా కేం రోగమా అని! నడుం వంగిపోయిందా? కాళ్ళూ, చేతు లేమైనా పడిపోయాయా? గుండ్రాయిలా ఉన్నాను! అప్పుడే ఎక్కడ ముసలాణ్ణయిపోయాన్రా? ఈ స్కూల్లో పనంటే ఎంత? గడ్డిపోచతో సమానం! ఇంత సులువు పని ఇంకెక్కడైనా ఉంటుందా?"

"అయ్యా! నువ్వు ముసలాడివి కాదంటే ఎవరైనా నవ్విపోతారు. నీ వయస్సు స్కూల్లో ఎలా రాసుకున్నారో ఏమో? ముప్ఫై ఏళ్ళప్పుడు పనిలో చేరి ఉంటే, ఇరవై ఏళ్ళు అని రాసుకుని ఉంటారు. ఆ నౌకరి వద్దు; ఆ ముష్టి డబ్బులూ వద్దు! నువ్వు మానుకో! కాలు కదప నవసరం లేకుండా నీ ఖర్చులు జరిగి పోతాయి."

రంగయ్య కొడుకు మాటలకు సవాలు పలుకుతూ వచ్చాడు కానీ, వాళ్ళది ఎడతెగని పోరుగా పరిణమించేసరికి తన నోటికి తాళం వేసుకున్నాడు. ఎవ రేమన్నా విరక్తుడుగా ఉండిపోయేవాడు. అతని మౌనాన్ని, మెతకదనాన్ని చూసి, 'ఇక నేం—దారికి వస్తున్నాడులే!' అని తృప్తిపడ్డారు కొడుకులు.

* * *

శివు పూర్తయిపోయింది.

ఈ రెండు నెలలూ ఇంటి దగ్గరే పడి ఉన్న రంగయ్య ఆ రోజు కనిపించ లేదు. పొద్దు గూకేంత వరకు కూడా అతని విషయం ఎవరూ అంతగా పట్టించుకోలేదు. దీపాలు పెట్టే వేళయినా అతని ఆచూకీ తెలియకపోయేసరికి అందరికీ గాభరా పట్టుకొంది.



రంగయ్య, రంగయ్యతో పాటు కుక్క—వస్తా లేరు.

ఆ రోజు అతను పనిలోకి వెళ్ళలేదన్న విషయం కొడుకులకు బాగా తెలుసు. అయితే, మరెక్కడికి వెళ్ళిఉంటాడిప్పుడు?

ఇండియా కని బయలుదేరి, అమెరికాను పట్టుకొన్న కొలంబస్ లాగా బాలరాజు, దేవరాజు అటువే పోకడ, ఇటువే పోకడ వెళ్ళారు—రంగయ్యను వెతకడానికి.

మంగమ్మ ఒక్కతే టీ కొట్టు ముందర లాంతరు వెలుగులో బెంగగా నిలబడి ఉంది.

సికందర్ గ్రేడు టీచరు సోమనాథం అక్కడికి వచ్చి, "టీ వేసియ్యి, మంగమ్మా!" అంటూ కండువాతో బెంచీ మీది దుమ్ము దులిపి కూర్చున్నాడు.

పరధ్యానంగా టీ కలుపుతూన్న మంగమ్మ ముఖాన్ని చూసి— "ఏం, మంగమ్మా, అదోలా ఉన్నావు?" అన్నాడు.

"ఏం చెప్పమంటావు? గడ్డాలు, మీసాలు నెరిసిపోయినా ఆయన కింకా పెంకితనం పోయింది కాదు. స్కూల్లో పని మానుకోను అంటాడు. అబ్బాయిలు వద్దు అని మొత్తుకుంటారు. ఇంత మాత్రానికే ఉన్నట్టుండి మాయమై పోవాలా? అందుకే ఏమనాలన్నా నాకు భయం! ఆ మనిషికి అలుక జాస్తి! పొద్దున్నుంచి కనిపించడం లేదు. పెద్దాడూ, చిన్నోడూ — ఇద్దరూ కాళ్ళరిగేట్లు తిరుగుతున్నారు. ఎక్కడున్నాడో, ఏమో?"

టీ అందుకుంటూ అన్నాడు సోమనాథం: "తెల్లవారి ఏడు గంటలప్పుడు హెడ్మాస్టరుగారి ఇంటి దగ్గర కనిపించాడు నాకు. ఆయన ఏదైనా పని మీద పంపించి ఉంటారేమో అడిగి తెలుసుకో రాదూ?"

"బడిలో పని మానుకున్న ...వాడి హెడ్మాస్టరుకు ఇంకేం పని చేసి పెడతాడు? ఏమోలే— అబ్బాయిలు రానీ, పంపుతాను" అంది మంగమ్మ ఆశ్చర్యంగా.

సోమనాథం టీ తాగి వెళ్ళిపోయాడు.

దేవరాజు ఎక్కడెక్కడో తిరిగి వాడిన ముఖంతో, అలసిపోయిన శరీరంతో ఉసూరుమంటూ ఇంటికి వచ్చాడు.

అతడు వచ్చీ రాగానే—"ఒరేయ్, పెద్దాడా, తెల్లారి హెడ్మాస్టరింటికాడున్నాట్ట! సోమనాథం పంతులు చెప్పాడు. వెళ్ళి అడిగి రారా!" అంటూ పురమాయించింది మంగమ్మ.

దేవరాజు గబగబ హెడ్మాస్టరుగారి ఇంటికి వెళ్ళాడు.

భోజనానంతరం వాలుకుర్చీలో కూర్చుని తాంబూలం వేసుకుంటున్న హెడ్మాస్టరుగారిని చూడగానే— "నమస్కారం, సార్!" అన్నాడు.

"రావయ్యా రా!" అన్నాడు హెడ్మాస్టరుగారు.

"మా అయ్య తెల్లారినుంచి. . ." దేవరాజు మాటలను ముందుకు కొనసాగ నివ్వకుండా అడ్డుకొన్నా డాయన.

"పాపం! మీ రేమో నౌకరీ మానుకోమని వేధిస్తారట మీ నాన్నను. అయినా, ఇంకెన్నాళ్ళు లేవయ్యా! అతని సర్వీసంతా ఇంక మూడు, మూడున్నర సంవత్సరాలకంటే ఎక్కువ ఉండదు. కళ్ళు మూసుకుంటే అది గడిచిపోతుంది. ఆ తరవాత ఎలా వెళ్ళిన వాడు అలా తిరిగి వస్తాడు."

"ఎక్కడికి వెళ్ళాడు?" అన్నాడు దేవరాజు, ఆత్రుతను అణచుకోలేక.

"చెబుతాను. పులికోన తెలుసా? మన జిల్లాలో మారుమూల ప్రాంతం! రైళ్ళు గానీ, బస్సులుగానీ వెళ్ళవక్కడికి! కానీ, రంగయ్యకు అహోబు వచ్చినట్లుంది. అంతా తన అదృష్టం అన్నాడు. ఖర్చులకు నా దగ్గర పది రూపాయలు పుచ్చుకున్నాడు, జీతం రాగానే పంపించి వేస్తానని చెప్పి! తాను వెళ్ళిపోయేంత వరకు ఈ విషయం పిల్లలకైనా తెలియనివ్వద్దని బతిమాలుకున్నాడు."

"నా కేమీ బోధపడ్డం లేదండీ!" అన్నాడు దేవరాజు.

"మీ నాన్న బదిలీ అయిపోయాడయ్యా! ట్రాన్స్‌ఫర్ ఆర్డరు తీసుకుని ఉదయం వెళ్ళిపోయాడు!"

ప్రపంచంలోని ఆశ్చర్యమంతా దేవరాజు ముఖంలో నీడకట్టుకొంది. ★